సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శనివారం । 9 । నవంబర్ । 2024



భారీగా రేషన్ బియ్యం పట్టివేత
ప్రొద్దుటూరులో అధికారులు భారీగా రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. పట్టణ పరిధిలోని మూడు ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. -8లో




గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలి
గౌరవం అనేది ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఉండాలే తప్ప.. ఏకపక్షంగా ఉండకూడదని వైఎస్సార్‌సీపీ మహిళా కార్పొరేటర్లు అన్నారు. -8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.2/23.8
జిల్లాలో శుక్రవారం 23.8 – 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

12 నుంచి గండిలో పవిత్రోత్సవాలు


గండి వీరాంజనేయ స్వామి

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో ఈనెల 12 నుంచి 15వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ సహాయకమిషనర్ వెంకట సుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. ఆ రోజు సాయంత్రం అంకురార్పణతో కార్యక్రమాలు మొదలవుతాయని తెలిపారు.13,14 తేదీల్లో పలు హోమాలు నిర్వహించి 15వ తేదీన మహా పూర్ణాహుతి, మహాకుంభ ప్రోక్షణ తీర్థ ప్రసాద వినియోగంతో పవిత్రోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. భక్తులు ఈ వేడుకలకు హాజరు కావాలని వారు కోరారు.

11న జాబ్‌మేళా



కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేది ఉదయం 10 గంటలకు నగరంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రముఖ కంపెనీల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎ.సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై 18–30 ఏళ్లలోపు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. హోదానుబట్టి రూ. 11,875 నుంచి రూ. 33,000 వరకు వేతనం ఉంటుందని వివరించారు. అభ్యర్థులు తమ విద్యార్హతల ధృవపత్రాలు, ఫొటోలతో రావాలని తెలిపారు. ఆసక్తిగల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చక్రాయపేటలో...
ఈనెల 11వ తేది ఉదయం 10 గంటలకు చక్రాయపేటలోని ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా జరగనుంది. అమర్‌రాజా గ్రూప్, అల్ డిక్సన్ (కిరణ్ సర్వీసెస్)కంపెనీలలో వివిధ హోదాల్లో పనిచేసేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి తెలిపారు.

అకౌంట్ల ఓపెన్‌కు ప్రత్యేక శిబిరాలు


కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఐపీబీబీ అకౌంట్లను తెరిచేందుకు ఈనెల 15న ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని కడప డివిజన్ పోస్టల్ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తపాలాశాఖ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు ద్వారా కొత్త ఖాతాలను తెరిచి ఆధార్ లింకులను సులభతరం చేయడానికి లబ్ధిదారుల కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కొత్త ఐపీబీబీ ఖాతాలను తెరవడం, ఇప్పటికే ఉన్న ఐపీబీబీ అకౌంట్లకు ఆధార్ లింకు చేయడం, మ్యాపింగ్ చేయడం వంటివి తమ లక్ష్యమన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న 2.65 లక్షల అకౌంట్లు పునరుద్ధరిస్తామని వివరించారు.

హయ్యర్ పెన్షన్‌ను పునరుద్ధరించాలి


కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీలో రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులకు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా హయ్యర్ పెన్షన్ విధానాన్ని నిలుపుదల చేశారని, వాటిని తిరిగి పునరుద్ధరించాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బీసీ సుబ్బారెడ్డి, రవీంద్రనాథ్‌వర్మ తెలిపారు. శుక్రవారం కడప నగరంలోని పీఎఫ్ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రమిచ్చారు. ఈ హయ్యర్ పెన్షన్ ప్రక్రియను నిలుపుదల విషయమై రాష్ట్రంలోని కడప, గుంటూరు, రాజమండ్రి, విశాఖపట్టణం ప్రాంతీయ కార్యాలయాల వద్ద ధర్నాకు పిలుపునిచ్చామన్నారు. సమయం లేనందున 100 మందితో కడప పీఎఫ్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించి కమిషనర్‌కు వినతిపత్రమిచ్చామన్నారు. కోశాధికారి సోమశేఖరరెడ్డి, రాష్ట్ర నాయకులు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్‌కు సన్నద్ధం

దేశ సరిహద్దుల్లో నిరంతరం పహారా కాసే శ్రామికులు.. మన సైనికులు. భూమాత సేవ కోసం జీవితాన్ని ధార పోసే త్యాగమూర్తులు వారు. అందుకే సైనికులంటే మనదేశంలో ప్రత్యేక గౌరవం. సైనికుడవ్వాలని...భారత త్రివిధ దళాల్లో పనిచేయాలని కల లుగనే ప్రతి యువకుడికి అగ్నివీర్ పిలుస్తోంది. ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి కడప క్రీడా ప్రాధికార సంస్థ మైదానం వేదిక కానుంది.




ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి వచ్చే అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన షెడ్డు

- ఈనెల 10 నుంచి 15 వరకు అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ
- కడప డీఎస్ఏ మైదానంలో ఏర్పాట్లు పూర్తి
- 4 వేల మంది అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్షలు
- హాజరుకానున్న 13 జిల్లాల అభ్యర్థులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానం వేదికగా అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అగ్నివీర్ పథకంలో భాగంగా ఆర్మీలో చేరాలనుకునే వారికి ఇప్పటికే రాతపరీక్ష పూర్తి చేయగా, అందులో అర్హత సాధించిన వారికి ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈనెల 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. అగ్నివీర్‌లో భాగంగా జనరల్ డ్యూటీ, టెక్నికల్, ట్రేడ్స్‌మెన్, క్లర్క్/స్టోర్‌కీపర్ తదితర ఉద్యోగాలకు సంబంధించిన ఎంపికలు నిర్వహించనున్నారు. పదోతరగతి, ఇంటర్, ఐటీఐ తదితర అర్హతలు కలిగి ఇప్పటికే పరీక్ష రాసి అర్హత సాధించిన వారు ఈ ఎంపికలకు అర్హులు.

4వేల మంది అభ్యర్థులు..
రిక్రూట్‌మెంట్ ర్యాలీకి కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన అభ్యర్థులు 4వేల మంది హాజరు కానున్నారు. ప్రతిరోజు 800 మందికి ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఎత్తు, బరువు, ఛాతి, 1.6 కి.మీ పరుగు పందెం, బీమ్ పుల్స్, జిగ్‌జాగ్ బ్యాలన్స్ ఆప్టికల్స్ తదితర పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో మెడికల్ టెస్ట్‌లు నిర్వహించనున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి తరలివచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. కడప నగరపాలక సంస్థ, ఇంజినీరింగ్ అధికారుల సహకారంతో ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారులు మైదానంలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు..మెడికల్ టెస్ట్ పూర్తయ్యే వరకు ఒక క్రమపద్ధతిలో సాగేలా ఏర్పాట్లు చేశారు.

- గ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ శుక్రవారం రాత్రి పరిశీలించారు. ర్యాలీ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన అన్ని సెక్షన్‌లను పరిశీలించారు. రిక్రూట్‌మెంట్ ర్యాలీ వివరాలను డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ కలెక్టర్‌కు వివరించారు. రిక్రూట్‌మెంట్ మెడికల్ ఆఫీసర్ మేజర్ అమర్‌దీప్‌కుమార్, కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, కమిషనర్ మనోజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఏర్పాట్లపై ఆర్మీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



సాగునీరు అందేలా చూడాలి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి
- నీటి లభ్యత, సాగునీటి వ్యవస్థపై సమీక్ష సమావేశం

కడప సెవెన్‌రోడ్స్: వ్యవసాయానికి సాగునీరు అందించి పంటలు దెబ్బతినకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డ్ రూమ్ హాలులో జిల్లాలో నీటి లభ్యత, సాగునీటి పంపిణీ, తాగునీటి సరఫరాపై నీటిపారుదల శాఖ, వ్యవసాయ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన మ్యాప్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అందించే సాగునీటి నిర్వహణ వ్యవస్థను పటిష్టంగా అమలు చేసి రైతులకు మేలు జరిగేలా అన్ని పంటలకు నీరు అందేలా చూడాలన్నారు. జిల్లాలోని భారీ,మధ్య, చిన్న తరహా నీటిపారుదల ప్రాజెక్టులలో ఎన్ని టీఎంసీల మేరకు నీటి నిలువ ఉన్నాయని వాటి కింద ఎంత ఆయకట్టు ఉందని సంబంధిత ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవోలు వ్యవసాయ, నీటిపారుదల శాఖలతో సమన్వయం చేసుకొని సమస్యలను పరిష్కరించుకుంటూ వారానికి ఒక సమావేశం నిర్వహించుకోవాలని సూచించారు. జిల్లాలోని తాగునీటి వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కడప, బద్వేలు, జమ్మలమడుగు,ఆర్డీఓలు జాన్ ఇర్విన్,చంద్రమోహన్, సాయి శ్రీ, ఇరిగేషన్ ఇంజనీర్లు, వ్యవసాయ అధికారులు, గ్రౌండ్ వాటర్ అధికారులు, ఆయా మండల తహశీల్దార్లు పాల్గొన్నారు.

భూముల వెరిఫికేషన్ పూర్తి చేయాలి

కడప సెవెన్‌రోడ్స్: ఫ్రీహోల్డ్ అసైన్మెంట్ భూముల వెరిఫికేషన్ ప్రక్రియను ఈనెల 10వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో డీఆర్‌ఓ, ఆర్డీఓలు, సంబంధిత సెక్షన్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫ్రీహోల్డ్ అసైన్మెంట్ భూముల ధృవీకరణకు సంబంధించి జిల్లాలో పెండింగ్ లో ఉన్న అసైన్డ్, డాటెడ్, ఇనాం, షరతు గల పట్టా మొదలైన కేటగిరీలకు చెందిన భూములను రీవెరిఫికేషన్ చేయాలన్నారు. పక్కాగా తనిఖీ చేసి అవగాహన కల్పించి వేగవంతంగా పెండింగ్ ఉన్న భూముల ధ్రువీకరణను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అందుకోసం మండల స్థాయిలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వోలు సంబంధిత అధికారులతో టీములుగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లాలోని ఎస్.మైదుకూరు మండలాన్ని.. ఫ్రీ హోల్డ్ ల్యాండ్స్ రి–వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహణకు పైలెట్ మండలంగా గుర్తించామని వెల్లడించారు. పెండింగ్ ఉన్న మండలాలలో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఇంచార్జి డీఆర్‌ఓ శ్రీనివాసులు, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీఓలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్ర మోహన్, భానుశ్రీలతోపాటు కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్, డేటెడ్ ల్యాండ్ డీటీలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు


క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న నిర్వాహకులు

కమలాపురం: స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల క్రీడా ప్రాంగణంలో శనివారం నుంచి 68వ రాష్ట్ర స్థాయి రగ్బీ స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఫిజికల్ డైరెక్టర్లు అరుణ కుమారి, తిరుపాల్‌రెడ్డి, శివ శంకర్ రెడ్డి తెలిపారు. శనివారం వారు క్రీడా మైదానాన్ని కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డితో కలసి పరిశీలించారు. కాగా క్రీడల నిర్వహణతో పాటు 13 ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు వసతులు, సౌకర్యాల ఏర్పాట్లు సిద్ధం చేశారు. ప్రతి ఉమ్మడి జిల్లా నుంచి 28 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరవుతున్నారని వారు వెల్లడించారు.

లక్ష్యసాధనకు అధికారులు కృషి చేయాలి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సూక్ష్మనీటి సాగు పథక ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర రెడ్డి

కడప అగ్రికల్చర్: పంట పొలాలకు ఏర్పాటు చేసే బిందు, తుంపర సేద్య పరికరాల పంపిణీ లక్ష్యాన్ని అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని సూక్ష్మనీటి సాగు పథక జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప కలెక్టరేట్‌లోని ఏపీ ఎంఐపీ కార్యాలయంలో బిందు, తుంపర సేద్య లక్ష్యంపై కంపెనీ ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 29.300 హెక్టార్లకు బిందు, తుంపర సేద్య అమలు లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఇందులో ఇప్పటివరకు 20180 మంది రైతులు 26177 హెక్టార్లకు బిందు, తుంపర సేద్య పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 3065 మంది రైతులకు 3622 హెక్టార్లకు బిందు, తుంపర సేద్య పరికరాల మంజూరుకు కలెక్టర్ నుంచి పరిపాలనా అనుమతులను పొందామని తెలిపారు. బిందు, తుంపర సేద్య పరికరాలు అవసరమున్న ప్రతి రైతు దరఖాస్తు ప్రక్రియ త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న రైతుల పొలాల్లో కంపెనీ ప్రతినిధులు త్వరగా ప్రాథమిక సర్వే పూర్తి చేస్తే రైతులు తమ వాటాను చెల్లించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి, ఎంఐ ఇంజనీర్లు, యంఐడీసీలు, జిల్లా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

డీఎస్సీ స్క్రీనింగ్ టెస్ట్ వాయిదా

కడప రూరల్: ఈ నెల 10వ తేదీన జరగాల్సిన ఉచిత డీఎస్సీ స్క్రీనింగ్ పరీక్షను వాయిదా వేసినట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికార అధికారి కే.సరస్వతి తెలిపారు. ఉభయగోదావరి జిల్లాల్లో శాసనమండలి ఎన్నికల ప్రకటన జారీ చేసినందున, ఎన్నికల నియమావళి ప్రకారం ఈ పరీక్షను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తదుపరి పరీక్ష తేదీని తెలుపగలమని తెలిపారు. పరీక్ష తేదీ మార్పును అభ్యర్థులు గమనించాలని పేర్కొన్నారు.

డీఎస్పీల బదిలీలు


ఎస్‌బీ డీఎస్పీగా నియమితులైన వాసుదేవన్

కడప కోటిరెడ్డిసర్కిల్: రాష్ట్ర వ్యాప్తంగా 20 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులోభాగంగా శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి డీఎస్పీగా పనిచేస్తున్న ఆర్.వాసుదేవన్‌ను కడప ఎస్‌బీ డీఎస్పీగా బదిలీ చేశారు. అలాగే విజిలెన్స్ అండ్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీగా పని చేస్తున్న కొంపల్లి వెంకటేశ్వరరావును జమ్మలమడుగు డీఎస్పీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కన్నేశారు.. కట్టేశారు!

- అన్యాక్రాంతమవుతున్న పాత దువ్వూరు గ్రామ కంఠం భూములు
- అధికారుల అండతోనే నిర్మాణాలు జరుగుతున్నాయంటున్న స్థానికులు


జాతీయ రహదారి పక్కన పాత దువ్వూరు గ్రామ కంఠంలో జరుగుతున్న అక్రమ నిర్మాణం

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : ఎక్కడో మారుమూల కాదు.. పట్టా స్థలం అనుకుని అనుభవంలో ఉన్న పొరంబోకు స్థలం కాదు.. గత 20 ఏళ్లుగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న గ్రామ కంఠం స్థలాల్లో అక్రమార్కులు స్థలాలను ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టారు.. ఈ అక్రమ నిర్మాణాలపై ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల వారు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ అక్రమ నిర్మాణాలు మాత్రం ఆగడం లేదు. దీనిపై చర్యలు తీసుకుంటామని ఓ వైపు రెవెన్యూ అధికారులు చెబుతున్నప్పటికీ నిర్మాణాలు మాత్రం జరిగిపోతూనే ఉన్నాయి.

- మండల కేంద్రమైన దువ్వూరులో పట్టణ సమీపంలోని కడప–కర్నూలు జాతీయ రహదారి పక్కనే ఉన్న పాత దువ్వూరు గ్రామ కంఠం భూములను కొందరు అక్రమార్కులు ఆక్రమించి కాంప్లెక్స్ భవనాలు నిర్మిస్తున్నారు. గ్రామ కంఠం భూములైన సర్వే నంబరు 381/27లో 1.84 ఎకరాలు, 371/25లో ఎకరా, 371/24లో 1.24 ఎకరాలు డీకేటీ పట్టా భూములుగా ఉన్నాయి. సర్వే నంబరు 371/3లో 0.82 ఎకరాలను 2002లో రెఫరెన్స్ నంబరు ఈ1/3698/98 ప్రకారం మండల రెవెన్యూ కార్యాలయం నిర్మించేందుకు అప్పటి ఆర్డీఓ చర్యలు తీసుకోగా అనివార్య కారణాల వలన పనులు చేపట్టలేదు. ప్రస్తుతం తహసీల్దారు కార్యాలయం కేసీ కెనాల్ భవనంలో కొనసాగుతోంది. ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వ అవసరాల కోసం భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులే స్థలాల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవటం లేదు. జాతీయ రహదారికి ఓ వైపు అద్దె భవనాలు, వాటి వెనకాల పెద్ద ఎత్తున ఇంటి నిర్మాణం చేపట్టారు. ఈ అక్రమాలపై ఇప్పటికే పత్రికల్లో వార్తలు వెలువడ్డాయి. ఈ ఘటనలపై రెవెన్యూ అధికారులు అప్పటికప్పుడు స్పందించడం, కొన్ని రోజులు పనులు ఆపించడం మళ్లీ షరామామూలే అన్నట్లు పరిస్థితి తయారైంది. పునాదుల దశనుంచే అక్రమ నిర్మాణాలపై సంబంధిత రెవెన్యూ అధికారులకు తరచూ ఫిర్యాదులు అందుతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వ స్థలాలు కాపాడాల్సిన స్థానిక రెవెన్యూ అధికారులే అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారని దువ్వూరు ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణ, వాటిల్లో అక్రమ కట్టడాలపై ఆరంభంలోనే చర్యలు తీసుకుంటే అడ్డుకట్ట వేయొచ్చు. కానీ అధికారుల దృష్టికి వచ్చినప్పటికీ ఆక్రమణలను అడ్డుకోకపోవటంతో అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు. ఇప్పటికైనా దువ్వూరు గ్రామ కంఠం స్థలాల్లోని ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

వీరభద్రస్వామి హుండీ ఆదాయం లెక్కింపు

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. దేవదాయ, ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఆలయ ఈఓ మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో.. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి శుక్రవారం వరకూ భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను లెక్కించారు. ఈ సందర్భంగా హుండీల ద్వారా వీరభద్రస్వామికి రూ.10,19,840 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఈ హుండీల లెక్కింపును తహసీల్దారు రమాకుమారి పరిశీలించారు. హుండీల్లోని నగదును స్థానిక ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థుల చేత లెక్కించడం గమనార్హం. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ 20 మందికి పైె విద్యార్థులు హుండీల్లోని నగదు వేరుపరచి లెక్కించారు. విద్యార్థుల చేత ఇలాంటి పనులు చేయించరాదని తెలిసినప్పటికీ దేవదాయ, ధర్మదాయ పరిశీలకులు పట్టించుకోకపోవటం శోచనీయం.

మైలవరం జలాశయంలో బోటింగ్ పునఃప్రారంభం



బోటింగ్‌లో అధికారులు, నాయకులు

జమ్మలమడుగు : మైలవరం జలాశయంలో బోటింగ్ పునఃప్రారంభించారు. శుక్రవారం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నర్సాజీ కొట్టాల సమీపంలో ఏపీ టూరిజం ఆధ్వర్యంలో బోటింగ్ పునఃప్రారంభం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేష్ రెడ్డి మాట్లాడుతూ పర్యాటక రంగం అభివృద్ధి చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలను తీసుకోవడం జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో మైలవరం, గండికోట ప్రాంతాలు పర్యాటకులను ఆకట్టుకునే విధంగా బోటింగ్‌ను మరింత మెరుగుపరచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

10న ఉచిత మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ, ఏపీయూడబ్ల్యూజే నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కాళ్లలో సిరలవాపు వ్యాధి(వెరికోస్ వెయిన్స్)పై కడపలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఈ నెల 10న నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. డీఎస్పీ కార్యాలయంలో వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శిబిరం నిర్వాహకులు మాట్లాడుతూ ప్రముఖ వైద్యులు డాక్టర్ వినయ్ న్యాపతి, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ హరీష్ రాజ్‌కుమార్ వ్యాధిపై అవగాహన కల్పించడంతోపాటు ఉచిత వైద్య సేవలందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఆంజనేయులు, శ్రీనివాసులు, రామాంజనేయరెడ్డి, నాగరాజు, సుబ్బరామయ్య, శ్రీనాథ్ రెడ్డి, సురేంద్ర, సర్దార్, మీడియా సభ్యులు పాల్గొన్నారు.

గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలి

- సభాధ్యక్ష స్థానాన్ని కించపరిచేలా వేలు చూపిస్తూ మాట్లాడం తగదు
- మొదటి మీటింగ్‌లోనే కార్పొరేటర్ పట్ల ఎమ్మెల్యే నోరుపారేసుకున్నారు
- అందుకే రక్షణ కల్పించాలని ఎస్పీకి విన్నవించాం
- మరుసటి రోజే ఎస్పీని బదిలీ చేయించారు
- మేం ఒక్కొక్కరమే వచ్చాం.. ఎమ్మెల్యే ఒక్కరే రాకుండా మందిని వెంటేసుకొచ్చారు
- ఎమ్మెల్యే మాధవిపై తీవ్ర స్థాయిలో మండిపడిన వైఎస్సార్‌సీపీ మహిళా కార్పొరేటర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్ : గౌరవం అనేది ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఉండాలే తప్ప.. ఏకపక్షంగా ఉండకూడదని వైఎస్సార్‌సిపి మహిళా కార్పొరేటర్లు అన్నారు. శుక్రవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నగర ప్రథమ పౌరుడైన మేయర్ సభాధ్యక్ష స్థానాన్ని కించపరిచేలా ఎమ్మెల్యే మాధవి వేలు చూపిస్తూ మాట్లాడటం దారుణమన్నారు. మొదటి సర్వసభ్య సమావేశంలో తామంతా ఆమెకు శాలువా కప్పి, బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపామని, అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చామన్నారు. కానీ ఎమ్మెల్యే ఆ మీటింగ్‌లోనే అధికార పార్టీ కార్పొరేటర్ ఉమాదేవిని 'ఆలంఖాన్‌పల్లె నీవు రాయించుకున్నావా.. నిన్ను బొట్టు పెట్టి పిలవాలా..' అంటూ నోటికొచ్చినట్లు మాట్లాడిందన్నారు. వాళ్ల పార్టీ కార్పొరేటర్‌నే ఇన్నేసి మాటలంటే.. ఇక తమ పరిస్థితి ఏంటని తాము ఆందోళనకు గురయ్యామన్నారు. అందుకే జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలిసి రక్షణ కల్పించాలని విన్నవించామన్నారు. మరుసటి రోజే ఎస్పీని బదిలీ చేయడం దారుణమన్నారు. గతంలో కార్పొరేషన్‌లో సర్వసభ్య సమావేశాలు ఎంతో హుందాగా జరిగేవని, ప్రజా సమస్యలపై చర్చ జరిగేదన్నారు. ఈమె ఎమ్మెల్యే అయ్యాక పరిస్థితి దిగజారి పోయిందన్నారు. అసెంబ్లీలో స్పీకర్ పక్కన ముఖ్యమంత్రి కూర్చొంటున్నారా.. పోనీ మొన్న జరిగిన జెడ్పీ సమావేశంలో మీరు వేదిక ఎక్కి ఎందుకు కూర్చోలేదని ప్రశ్నించారు. ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా ఆమె నిర్వర్తించాల్సిన విధులపై జీవోలు చదువుకోవాలని హితవు పలికారు. తాము తమ భర్తలను రోడ్డుపై వదిలేసి ఒంటరిగా సమావేశానికి వచ్చామని, ఆ విధంగా ఎమ్మెల్యే ఎందుకు రాలేకపోయారని ప్రశ్నించారు. 400 మందిని వెంటేసుకొని ర్యాలీగా వచ్చారని, కౌన్సిల్ హాలు ఎదురుగా 100 మంది టీడీపీ కార్యకర్తలు చొరబడి రచ్చ చేశారన్నారు. తాము కూడా ఎమ్మెల్యే మాదిరి గొడవ చేసి ఉంటే పరిస్థితి ఏమయ్యేదని.. తమకు ఏమైనా జరిగి ఉంటే బాధ్యత ఎవరిదని నిలదీశారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రమశిక్షణ నేర్పారని, అందుకే సంయమనం పాటించామని తెలిపారు.

మాతో కూర్చోవడానికి ఎమ్మెల్యేకు నామోషీనా...

మాతోపాటు కూర్చోవడానికి ఎమ్మెల్యే నామోషీగా ఫీల్ అవుతున్నారా అని కార్పొరేటర్లు ప్రశ్నించారు. మేయర్ పక్కన ఎమ్మెల్యేకు కుర్చీ వేయాలని రూలేం లేదన్నారు. ఎమ్మెల్యే అయినంత మాత్రాన మీకు మాత్రమే విలువ ఇవ్వాలా.. మీరు ఎవరికీ ఇవ్వాల్సిన పనిలేదా అని నిలదీశారు. కడప నగరాన్ని అభివృద్ధి చేయడానికి ఏం సలహాలు ఇస్తారో ఇవ్వండి.. మీ వంతు బాధ్యతగా మీరేం చేస్తారో.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎన్ని నిధులు తెస్తారో చెప్పండి.. అంతే తప్ప కక్కిస్తా.. తాట తీస్తా అని రౌడీయిజం చేస్తే కుదరదన్నారు. ఐదు నెలలకే ఎమ్మెల్యే వ్యవహార శైలితో నగరప్రజలు విసిగిపోయారన్నారు. తనను గెలిపించిన ప్రజల కోసం ఎమ్మెల్యే ఏదైనా అభివృద్ధి చేసి మంచిపేరు తెచ్చుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే తిరగబడుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు సి.నాగమణి, శ్రీలేఖ, మేసా ప్రమీల రాణి, వై.మాధవి, ఎన్. మల్లీశ్వరి, కె.లక్ష్మీదేవి, కో ఆప్షన్ సభ్యులు పత్తి రాజేశ్వరి, బండి మరియలు, ఆ పార్టీ మహిళా నేతలు టీపీ వెంకట సుబ్బమ్మ, రత్నకుమారి, క్రిష్ణవేణి, ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భద్రతా వైఫల్యంపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



కలెక్టర్‌ను కలిసిన అనంతరం బయటికి వస్తున్న కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో పోలీసుల భద్రతా వైఫల్యం, వందల మంది టీడీపీ కార్యకర్తలు కార్పొరేషన్ కార్యాలయంలోకి చొరబడి సాగించిన రభసపై మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఆధ్వర్యంలో కార్పొరేటర్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 4న జరిగిన మొదటి సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ప్రవర్తనతో మహిళా కార్పొరేటర్లు భయాందోళనకు గురయ్యారని, అందుకే రక్షణ కల్పించాలని ఎస్పీకి విన్నవించారన్నారు. మూడంచెల భద్రత కల్పిస్తామని చెప్పిన పోలీసులు.. తమను మాత్రం ప్రతిచోటా తనిఖీ చేసి, గుర్తింపు కార్డులు చూసి లోపలికి అనుమతించారన్నారు. ఎమ్మెల్యే తన ఇంటి నుంచి వందలాది మందితో ర్యాలీగా వస్తే వారిని అడ్డుకోలేదని, చాలా మంది కౌన్సిల్ హాలు ఎదురుగా ఉన్న మరో హాలులో నక్కి గొడవ చేశారన్నారు. ఎమ్మెల్యే రచ్చ చేసి వెళ్లాక సమావేశం నిర్వహించాలని తాము తీర్మానించినా పోలీసులు, అధికారులు సహకరించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నాగమణి, సుజాత, హేమలత, గంగాదేవి, మల్లీశ్వరి, బి. లక్ష్మీదేవి, కె.లక్ష్మీదేవి, మాధవి, శ్రీలేఖ, సుబ్బారెడ్డి, సానపురెడ్డి శివకోటిరెడ్డి, రామలక్ష్మణ్‌రెడ్డి, కె.బాబు, షంషీర్, పార్టీ నేతలు దాసరి శివప్రసాద్, కో ఆప్షన్ సభ్యులు పత్తిరాజేశ్వరి, బి.మరియలు పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–14 మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 23 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన విజయనగరం జట్టు 85.2 ఓవర్లలో 280 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని విఘ్నేష్ 86, హేమంత్‌సింగ్ 67 పరుగులు చేశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో కృష్ణా జట్టు 286 పరుగులు చేయడంతో కృష్ణా జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

శ్రీకాకుళం జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెండో రోజు శుక్రవారం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 90 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 265 పరుగులు చేసింది. జట్టులోని సాయియశ్వంత్ 100 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. కిన్నుకుశాల్ 53 పరుగులు చేశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా శ్రీకాకుళం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 447 పరుగుల వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. శ్రీకాకుళం జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.



సాయియశ్వంత్, నెల్లూరు (100 పరుగులు)



విఘ్నేష్, విజయనగరం (86 పరుగులు)

గుంటూరు జట్టుకు ఆధిక్యం

వైఎస్‌ఆర్‌ఆర్-ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెండోరోజు తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 65.4 ఓవర్లలో 179 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన గుంటూరు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 30 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా గుంటూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 276 పరుగులు చేయడంతో గుంటూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

11న విజయవాడలో కడప కామెడీ షో

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ అకాడమి ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన ఉదయం 10 గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లె కళాక్షేత్రంలో మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి వేడుకలను పురస్కరించుకుని నిర్వహించనున్న కామెడీ ప్రదర్శన కార్యక్రమానికి కడప ఉర్దూ కళాకారులకు ఆ సంస్థ డైరెక్టర్ మస్తార్ నుంచి ఆహ్వానం అందింది. ఈ కామిడీ షోలో కడప ఉర్దూ కళాకారులు మగ్బుల్ అహ్మద్, మహబూబ్‌బాషా, షహుద్దీన్, సత్తార్‌ఫైజీలు పాల్గొననున్నారు. వీరంతా ఈ కామిడీ షోలో ఉర్దూ హాస్యనాటిక, మైమ్, మిమిక్రీ, ఏకపాత్రాభినయం వంటి కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు.

బైక్‌లు దొంగలించి జల్సాలు

- నలుగురు దొంగల అరెస్ట్
- 25 బైక్‌లు స్వాధీనం

ఎర్రగుంట్ల : బైక్‌లను చోరీ చేసి విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్న నలుగురు యువకులు ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. వారి నుంచి రూ.25 లక్షల విలువైన 25 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పట్టణ సీఐ నరేష్ బాబు వివరాలు వెల్లడించారు. ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, గుత్తి, గుంతకల్లు, డోన్, విజయవాడ, ధర్మవరం, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల్లో రైల్వేస్టేషన్, బస్టాండ్, షాపింగ్ మాల్స్, హాస్పిటల్స్ తదితర పార్కింగ్ ప్రాంతాలలో నిలిపి ఉన్న ఖరీదైన బైక్‌లను ఏడాది కాలం పాటు వరుసగా చోరీ చేశారన్నారు. బాధితుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు జిల్లా ఎస్పీ, జమ్మలమడుగు డీఎస్పీ ఆదేశాలతో విచారణ చేపట్టామన్నారు. ఎర్రగుంట్ల పట్టణం ప్రొద్దుటూరు రోడ్డులోని రామాంజనేయపురం క్రాస్ రోడ్డు వద్ద ఎస్ఐ నాగమురళి, సిబ్బందితో కలిసి.. మొలక గురివిరెడ్డి (నంద్యాల జిల్లా), షేక్ చిన్న హజీబాషా (నంద్యాల జిల్లా), షేక్ ఇమాం హుస్సేన్ (అనంతపురం జిల్లా), బొడ్డుబోయిన నాగేష్ (నంద్యాల జిల్లా) వీరిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఈ నిందితులను విచారణ చేసి, వారి వద్ద నుంచి పలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలలోని రూ.25 లక్షల విలువైన 25 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని కోర్టుకు హాజరు పరచగా, రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. దొంగలను అరెస్ట్ చేసినందుకు సీఐ నరేష్‌బాబు, ఎస్ఐ నాగమురళి, ఏఎస్ఐ గురుశంకర్, హెడ్‌కానిస్టేబుల్స్ అల్‌ఫ్రెడ్, గోపాల్, రాఘవరెడ్డి, కానిస్టేబుల్స్ ఆర్.చంద్ర, డి.లక్ష్మీనారాయణ, ఖాదర్‌వలి, సంజీవ, రామచంద్ర, సుబ్బయ్య, రాఘవేంద్రరెడ్డి, హరినాథ్‌రెడ్డి, కాసన్నలను జమ్మలమడుగు డీఎస్పీ అభినందించారు.

నేడు కడపలో జాతీయ ఉర్దూ సెమినార్

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ మహిళ డిగ్రీ కళాశాలలో శని, ఆదివారాల్లో జాతీయ ఉర్దూ సెమినార్ జరుగుతుందని జాతీయ సెమినార్ చైర్మన్ సత్తార్ ఫైజీ, అంజుమన్ తరఖీ ఉర్దూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ అబ్దుల్ సత్తార్ సాహిర్, సయ్యద్ హిదాయతుల్లా తెలిపారు. ఈ జాతీయ ఉర్దూ సెమినార్‌కు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నారని వారు తెలిపారు. ఇందులో భాగంగా 9వ తేదీ ఉదయం ప్రజా ప్రతినిధులతో ప్రారంభ సభ, మధ్యాహ్నం ఉర్దూ భాషాభివృద్ధిలో ప్రభుత్వ పాత్ర, సాయంత్రం సెషన్‌లో ఉర్దూ భాషాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర, రాత్రి జాతీయ కవి సమ్మేళనం ఉంటుందని తెలిపారు. అలాగే 10 వ తేదీ ఉదయం ఉర్దూ భాషాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర, మధ్యాహ్నం ఉర్దూ భాషాభివృద్ధిలో ఉర్దూ సంఘాల పాత్ర, సావనీర్, వివిధ రచయితల పుస్తకాల ఆవిష్కరణ, పరిశోధన పత్రాల సమర్పణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలోని అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కవులు రచయితలు, భాషా పరిశోధకులు, ఉర్దూ భాషాభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు జరపాలని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జిల్లాలోని మద్యం దుకాణాల యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీకి అమ్మకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలోని బెల్టుషాపు నిర్వాహకులపై బైండోవర్లు నిర్వహిస్తున్నామన్నారు. బెల్టు షాపులతో సంబంధం ఉన్న మద్యం షాపులకు రూ.5 లక్షల జరిమానా విధించి, లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కడప లైసెన్సీలు, కడప ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణకుమార్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్‌రెడ్డి, ఎస్ఐ నరసింహరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పశుగణన పక్కాగా జరగాలి

కడప అగ్రికల్చర్ : జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న పశుగణన పక్కాగా జరగాలని ఎన్యూమరేటర్లను జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శారదమ్మ ఆదేశించారు. పశుగణనలో భాగంగా శనివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న పశుగణన నమోదును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగామాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా గేదెలు, ఎద్దులు, ఆవులు, కోళ్లు, మేకలు ఇలా 16 రకాల జంతువుల వివరాల నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతుందన్నారు. ఈ పశుగణనకు రైతులు సహకరించాలని కోరారు. ఈ పశుగణన 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు జిల్లా కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీడీ రమణయ్య, ఏడీలు చంద్రశేఖర్, శ్రీనివాసులరెడ్డిలతోపాటు పశు వైద్యులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని విశ్రాంత ఉద్యోగి దుర్మరణం



మృతి చెందిన రామచంద్రారెడ్డి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో టిప్పర్ ఢీకొని విశ్రాంత ఉద్యోగి గుత్తి రామచంద్రారెడ్డి దుర్మరణం చెందిన సంఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పట్టణ సీఐ నరేష్‌బాబు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని న్యూకాలనీలో నివాసం ఉండే గుత్తి రామచంద్రారెడ్డి(70) ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో లైన్‌మ్యాన్‌గా ఉండి రిటైర్డ్ అయినారు. ఉదయం ప్రొద్దుటూరు వెళ్లడానికి ఇంటి వద్ద నుంచి స్కూటీలో బయలుదేరారు. నాలుగు రోడ్ల కూడలి వద్దకు రాగానే.. వేగంగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. టిప్పర్ రామచంద్రారెడ్డిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరామర్శ

ఈ విషయం తెలుసుకున్న వెంటనే జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డి ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కడపలో చోరీ

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరం గంజికుంట కాలనీలో భారీ దొంగతనం జరిగింది. దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంటిలోని బీరువాలు ధ్వంసం చేసి బంగారు. వెండి నగలను అపహరించారు. గంజికొండ కాలనీకి చెందిన సయ్యద్ మహమ్మద్ అలీ కరెంట్ ఆఫీస్లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల ఆరో తేదీన కుటుంబ సభ్యులతో కలిసి బద్వేల్‌కి వెళ్లి తిరిగి శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చారు. ఇంటి తాళాలు పగిలిపోయి ఉండడంతో చిన్న చౌక పోలీసులకు సమాచారం అందించారు. 30 తులాల బంగారు నగలు, కేజీ వెండి అపహరణకు గురైనట్లు తెలిపారు. ఎస్సై రవికుమార్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి దొంగల వేలిముద్రలను సేకరించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పలువురు సీఐల బదిలీలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు సంబంధించి పలువురు సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

సీఐ పేరు	ప్రస్తుతం పని చేస్తున్నది	బదిలీ అయిన ప్రాంతం
ఎస్.మహమ్మద్ అలీ	వీఆర్ కడప	మన్నూరు (రాజంపేట)
డి.రామాంజనేయులు	మన్నూరు	వీఆర్ అన్నమయ్య
బి.లక్ష్మన్న	ఉమెన్ పీఎస్ చిత్తూరు	ములకలచెరువు సర్కిల్
పి.రాజా రమేష్	ములకలచెరువు సర్కిల్	ఎస్‌బీ–3 అన్నమయ్య
బి.వెంకట చలపతి	ఎస్‌బీ-3 అన్నమయ్య	ఆలూరు సర్కిల్ (కర్నూలు జిల్లా)
ఎ.మోహన్‌కుమార్	డీసీఆర్‌బీ అన్నమయ్య ఉమెన్ పీఎస్–2	అన్నమయ్య (మదనపల్లె ట్రాఫిక్)
కె.ఎరీసావలీ	డీఎస్‌బీ-2 నంద్యాల	మదనపల్లె వన్‌టౌన్
ఎ.చాంద్‌బాష	మదనపల్లె వన్‌టౌన్	వీఆర్ అన్నమయ్య
ఎ.సత్యనారాయణ	వీఆర్ అన్నమయ్య	డీఎస్‌బీ–2 అన్నమయ్య
జె.శంకరయ్య	డీఎస్‌బీ-2 అన్నమయ్య	డీసీఆర్‌బీ అన్నమయ్య

రేపు 'బ్రౌన్' జయంతి ఉత్సవం

కడప కల్చరల్ : తెలుగు భాషోద్ధారకుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ 226వ జయంతిని ఈనెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించనున్నట్లు బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. ఇందులో భాగంగా స్మారక ఉపన్యాసం, సాయంత్రం 3 గంటలకు అష్టావధానం ప్రత్యేక కార్యక్రమాలుగా నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా వైవీయూ ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, విశిష్ట అతిథులుగా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, గౌరవ అతిథిగా విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సంజీవమ్మ హాజరవుతారన్నారు. ప్రధానవక్త, స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ విద్వాన్ పసుపులేటి శంకర్ బ్రౌన్ సాహితీ సేవ అనే అంశంపై ప్రసంగిస్తారని, సంగీత అధ్యాపకులు యలమర్తి మధుసూదన్ కావ్య పఠనం చేస్తారన్నారు. మధ్యాహ్నం ప్రముఖ అవధాని శారదా ప్రసన్న (ఎంవీఎస్ఎల్ ప్రసాద్) అధ్యక్షతన 'శతావధాని' ఉప్పలధడియం భరత్ శర్మ (తిరుపతి) అష్టావధానం నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సాహితీవేత్తలు పృచ్ఛకులుగా పాల్గొంటారని తెలిపారు.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

- మూడు ప్రాంతాల్లో స్వాధీనం
- తరలించిన తర్వాత మిగిలిన 134 బస్తాలు స్వాధీనం



గోడౌన్‌లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యంతోపాటు కాటాను స్వాధీనం చేసుకుంటున్న తహసీల్దార్ గంగయ్య





గోడౌన్‌లో నిల్వ ఉంచిన కంది పప్పు, చక్కెర ప్యాకెట్లు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో భారీగా రేషన్ బియ్యాన్ని శుక్రవారం పట్టుకున్నారు. పట్టణ పరిధిలోని మూడు ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండీ బజార్‌లోని వాసవి ట్రాన్స్‌పోర్టు పక్కన గోడౌన్ తీసుకున్న వ్యాపారి.. పట్టణంలో బియ్యం కొనుగోలు చేసి గోడౌన్‌లో బస్తాలు మార్చి ప్యాకింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గురువారం రాత్రి ఒక వ్యాన్‌లో వ్యాపారి బియ్యాన్ని తరలించిన అనంతరం సమాచారం అందడంతో రెవెన్యూ అధికారులు కాపలా ఉంచారు. శుక్రవారం సాయంత్రం అయిన కూడా వ్యాపారి లాక్ తీయలేదు. రెవెన్యూ సిబ్బందిని అక్కడే కాపలా ఉంచారు. ఎట్టకేలకు సాయంత్రం డిప్యూటీ తహసీల్దార్లు మల్లికార్జున, సాయినాథరెడ్డి, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి, వీఆర్‌ఓలు రవి, రామయ్య, సచివాలయ సిబ్బందిని సంఘటన స్థలానికి తహసీల్దార్ వి.గంగయ్య పిలిపించారు. ఎస్ఐ మహమ్మద్ రఫీ తన సిబ్బందితో వచ్చారు. సిబ్బందిని పిలిపించి తాళాలు పగలగొట్టారు. గోడౌన్‌లో 70 బస్తాల బియ్యంతోపాటు మరికొన్ని కందిపప్పు, చక్కెర ప్యాకెట్లు కనిపించాయి. రేషన్ షాపునకు సంబంధించిన ప్రభుత్వ కాటాతో పాటు బస్తాలను ప్యాకింగ్ చేసే మిషన్ కూడా అక్కడ ఉంది. చాలా రోజులుగా ఈ వ్యాపారం సాగిస్తున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ భర్త, మాజీ కౌన్సిలర్‌తోపాటు మరో కౌన్సిలర్ కుమారుడు తహసీల్దార్‌తో మాట్లాడుతూ గురువారం రాత్రి నుంచి చెబుతున్నా బియ్యాన్ని పట్టుకునేందుకు ఎందుకు వేగంగా స్పందించకపోతున్నారని ప్రశ్నించారు. ఈ కారణంగానే తాము ఆర్డీఓ, జేసీలకు ఫిర్యాదు చేశామన్నారు. ప్రొసీజర్ ప్రకారం తాము స్వాధీనం చేసుకుంటున్నామని తహసీల్దార్ అన్నారు. ఈ బియ్యం నిల్వలు కన్నెగాళ్ల నరేంద్ర అనే వ్యాపారివి అని తెలుస్తోంది. శుక్రవారం ఉదయం వరకు అతని ద్విచక్ర వాహనం గోడౌన్ వద్ద ఉన్నట్లు తెలిసింది.

మరో చోట 14 బస్తాలు

పొట్టిపాడు రోడ్డులోని మరో గోడౌన్‌లో 14 బస్తాల 30 కేజీల బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మహేంద్రనాథ్‌రెడ్డి స్వాధీనం చేసుకున్నారు. బియ్యం నిల్వ ఉంచడానికి ఇంటిని అద్దెకు తీసుకుని వ్యాపారం సాగిస్తున్నారు. ఈ బియ్యం కన్నెగాళ్ల నరేంద్రవి అని రికార్డులో నమోదు చేశారు.

వ్యాన్‌లో : స్థానిక బుడ్డాయపల్లెలో ఎండీయూ వాహనంలో ఉన్న 50 బస్తాల బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యం కొనుగోలు చేసిన వ్యాపారి ఎండీయూ వాహనం ద్వారా తీసుకెళుతుండగా ఇతరుల ఫిర్యాదు మేరకు పట్టుకున్నారు. ఎండీయూ వాహనాల ద్వారానే బియ్యం రవాణా చేస్తుండటం గమనార్హం. వీటిపై అధికారులు 6ఏ కింద కేసు నమోదు చేశారు.

టీడీపీ నేతకు చెందిన 70 బస్తాలు స్వాధీనం



పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రేషన్ బియ్యం బస్తాలు

ప్రొద్దుటూరు : స్థానిక మడూరు రోడ్డులో అక్రమ రేషన్ బియ్యం తరలిస్తుండగా శుక్రవారం రాత్రి టూటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ అదనపు ఆదాయ కోసం పట్టణంలో రేషన్ షాపు నిర్వహిస్తున్నాడు. 70 బస్తాల బియ్యాన్ని ఓ వ్యాపారికి అమ్మాడు. ఆ బియ్యాన్ని దువ్వూరుకు చెందిన వ్యాపారి తీసుకెళుతుండగా తమకు అందిన సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. వెంటనే పోలీసులు సమాచారం అందించడంతో.. డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చారు. పట్టుకున్న బియ్యం ఎవరివి అన్న విషయంపై వివరాలను సేకరిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ బియ్యాన్ని రేషన్ షాపులకు పంపుతున్నట్లు పేర్కొన్నారు. అదే సమయంలో టీడీపీ నేత పోలీస్‌స్టేషన్‌లో రేషన్ బస్తాల ఉన్న వాహనం వద్ద కనిపించాడు.